క్లుప్తంగా

ఎస్‌ఐకి సన్మానం



చిన్నంబావి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన జగన్మోహన్‌ను యూత్ కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దని సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగారి శ్రీనివాసులు, జగదీశ్, పరశురాం, బాలకృష్ణ, శివ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాన్‌గల్: మండలంలోని దొండాయిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి మాతృమూర్తి తారకమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం తారకమ్మ పాడె మోసి ఆమె పట్ల తన అభిమానాన్ని మాజీ మంత్రి చాటుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, నందిమళ్ల అశోక్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా అందించాలి



పాన్‌గల్: కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఉదయం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించి వంట గదిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట గది, పాత్రలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాజా కూరగాయాలను వినియోగించాలని వంట మహిళలకు సూచించారు.

ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



కొత్తకోట: కొత్తకోట పురపాలక సంఘానికి అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువినేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.14.83 కోట్లు విడుదల చేయడంపై బీజేపీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి డీకే అరుణ చిత్రపటాలకు పట్టణ బీజేపీ కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. కొత్తగా ఏర్పడ్డ కొత్తకోట పురపాలక సంఘానికి 15వ ఫైనాన్స్, 16వ ఫైనాన్స్ కింద ఇప్పటికే రూ.30 కోట్ల నిధులు విడుదలయ్యాయని, హిందూ శ్మశాన వాటిక, దళిత క్రైస్తవ శ్మశాన వాటికల ప్రహరీ నిర్మాణానికి, మార్కెట్ యార్డ్ నిర్మాణానికి, వివిధ వార్డుల్లో డ్రెయినేజీల నిర్మాణాలకు కేంద్రమే నిధులు మంజూరు చేసిందన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



ఆత్మకూర్: నియోజక అభివృద్ధే ధ్యేయంగా మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ముందు కెళ్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని పిన్నంచర్లలో రూ.10లక్షల ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గతంలో వెనక్కి వెళ్లిన నిధులు ఎమ్మెల్యే చొరవతో మంజూరయ్యాయని, ఈసందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్‌యాదవ్, గణేష్, మచ్చేందర్‌గౌడ్, మణివర్ధన్‌రెడ్డి, ఖాజన్న, విజయలక్ష్మి, రాములు, రామచంద్రి, సత్యన్న, విష్ణు, మాజీ సర్పంచ్ లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ మాసన్న తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సింగంపేటలో ఇందిరమ్మ ఇంటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు



పిన్నంచర్లలో..

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేపడుతున్నామని ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండలంలోని గ్రామాలు, మున్సిపాలిటీలోని వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శశిధర్, పంచాయతీ కార్యదర్శులు, వార్డుల అధికారులు పాల్గొన్నారు.

ఇంటి సర్వేలో తప్పిదాలొద్దు

అమరచింత: ఇందిరమ్మ ఇంటింటి సర్వేలో అర్హుల వివరాలను యాప్‌లో పొందుపరిచే సమయంలో తప్పిదాలుండొద్దని, పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని సింగంపేటలో శుక్రవారం ఇందిరమ్మ ఇంటింటి సర్వే కార్యక్రమ పరిశీలనతో పాటు పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటి కోసం దరకాస్తు చేసుకున్న వారి వివరాలన్నీ గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకున్నారన్నారు. అదేవిధంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని, మురుగు కాల్వలలో చెత్త నిల్వలు తొలగించాలని సూచించారు.

పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఝాన్సీ

పాన్‌గల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్యం, వసతులను వివరిస్తూ ప్రతి గర్భిణి పీహెచ్‌సీలోనే కాన్పు చేయించుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఝాన్సీ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణుల నమోదు, ఈడీడీ క్యాలెండర్, ప్రసవాల సంఖ్య పెంచాలనే అంశాలపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సిబ్బంది గ్రామాల్లో వైద్యం, అందిస్తున్న ప్రోత్సాహకాలు, 102 వాహనం తదితర అంశాలపై గర్భిణులను చైతన్యం చేస్తూ ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, ఆరోగ్య మందిర్ డాక్టర్ లారెన్స్, నర్సింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో 14వ వార్డుకు వెంకటస్వామి(55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం స్థానిక కాంగ్రెస్ నాయకులు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో చీర్ల విజయచందర్, సతీష్, ద్వారపోగు వెంకటేష్, బొంబాయి మన్నెంకొండ, చీర్ల రమేష్‌సాగర్, రాములు, కార్తీక్, సాయి, శ్యామ్, రామకృష్ణ, బన్నీ, రాజు ఉన్నారు.

ఆంగ్ల పదాలపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న విశ్వనాథం

ఖిల్లాఘనపురం: విద్యార్థులు ఆంగ్ల పదాలపై పట్టు సాధించినప్పుడే సమాజంలో పలు ఉద్యోగాల్లో మంచి అవకాశాలు వస్తున్నాయని క్లాస్‌మేట్ క్లబ్ మండల అధ్యక్షుడు విశ్వనాథం, ఎంఈఓ జయశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సోళీపురంలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంగ్ల పదజాల పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 4వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ఈ పరీక్ష ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. పరీక్షల్లో ప్రతి భకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట వద్ద జాతీయ రహదారి 44పై రోడ్డు దాటుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన నరేష్ రోడ్డు దాటుతుండగా కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. నరేష్ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు, గ్రామస్తులు వెంటనే 108కు సమాచారం ఇచ్చి, కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ సురేందర్

వనపర్తి విద్యావిభాగం: కలెక్టర్ ఆదేశానుసారం మర్రికుంట శివారులో గల ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సురేందర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో కష్టపడి లక్ష్యాలు సాధించాలని సూచించారు. తమ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, క్రమశిక్షణ, దృఢ సంకల్పంతో పోరాడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ప్రత్యేకతను గుర్తించి, దానిలో రాణించేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంచి, లక్ష్యాల కోసం మరింత పట్టుదలతో కృషి చేయడానికి ప్రేరణనిచ్చిందని ప్రిన్సిపాల్ సరస్వతి అన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ శుభలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించాలి

కొత్తకోట: మున్సిపల్ కేంద్రానికి టీయూఎఫ్‌ఐడీసీ నిధుల కింద మంజూరైన పనులు తక్షణమే మొదలుపెట్టాలని భారతీయ జనతాపార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొమ్ము భరత్‌భూషణ్ కోరారు. ఆయన మాట్లాడుతూ గతేడాది కాలంలో విడుదలైన ఈ నిధులు ఇప్పటికీ వాటికి సంబంధించిన పనులు చేపట్టలేదని, తక్షణమే ప్రారంభించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాలస్వామి, రాజారామ్‌యాదవ్, స్టార్ బాలు, ఆవుల నరేందర్‌గౌడ్, వెంకటేష్‌యాదవ్, ఏలియా, సురేష్‌గౌడ్ నందిమల్ల రాజు పాల్గొన్నారు.

చెట్ల కిందనే చదువులా.. ?

- పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు
- గదులు లేక చెట్ల కింద విద్యాభ్యాసం
- నిధులు మంజూరైనా అభివృద్ధికి నోచుకోని పాఠశాలలు



శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో చెట్టు కింద చదువుకుంటున్న విద్యార్థులు

శాంతినగర్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కూర్చోడానికి, నిలువ నీడలేక చెట్ల కిందే విద్యాభ్యాసం కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. వడ్డేపల్లి మండల పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 13, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ఉన్నత పాఠశాలలు 5, కస్తూర్బా గాంధీ పాఠశాల, రవీంద్ర ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 25 ప్రభుత్వ పాఠశాలల్లో వేల మంది విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, ఆటస్థలాలు, కూర్చోడానికి నిలువ నీడ లేకపోవడంతో విద్యార్థులు అసౌకర్యాల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. అంతేగాక తరగతులకు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించక పోవడంతో చదువులు అటకెక్కుతున్నాయి.

పాఠశాలల్లో పరిస్థితి ఇలా..

వడ్డేపల్లి మండల పరిధిలోని వడ్డేపల్లి, శాంతినగర్, రామాపురం, పైపాడు ప్రాథమిక పాఠశాలల్లో, కోయిల్‌దిన్నె, బుడమొర్సు ప్రాథమికోన్నత పాఠశాల, తనగల, శాంతినగర్, రామాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో మరుగుదొడ్లు, అదనపు గదులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కోసం మన ఊరు– మన బడి కార్యక్రమంలో మంజూరైన పనులు మధ్యలో నిలిపివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు మంజూరు కాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు నిలిపేశారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో వసతులు కల్పించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



శాంతినగర్ పీఎస్ పాఠశాల గదుల్లో రాళ్లు పోసిన దృశ్యం(ఫైల్)



శాంతినగర్ పీఎస్‌లో అసంపూర్తిగా తరగతి గదులు

తాగడానికి నీళ్లు లేవు..



మా పాఠశాలలో ఓవర్ హెడ్ ట్యాంక్ లేదు. ఉదయం వేల డ్రమ్ములో నీళ్లు పట్టుకోవాలి. ఆ నీటినే తాగాల్సి వస్తుంది. మధ్యాహ్నం భోజనం చేశాక ప్లేట్లు కడుక్కోడానికి, మరుగుదొడ్లకు వాటినే వాడుకోవాల్సి వస్తుంది. తాగు నీటిని నిల్వ చేసి, వాడుకోడానికి అవసరమైన నీటిని ఏర్పాటు చేయాలి.

జయశ్రీ,
ఐదవ తరగతి, పీఎస్, శాంతినగర్

చెట్ల కింద చదువుకోవాల్సి వస్తోంది..



మా పాఠశాలలో మూడు గదులు ఉన్నాయి. ఐదు తరగతులకు గాను మూడు గదులు ఉండటంతో ఒకే గదిలో రెండు తరగతులు చెబుతున్నారు. రెండు గదులు పనులు మొదలు పెట్టి కప్పు వేసి రాళ్ల కుప్పలు పోశారు. పాములు, తేళ్లు తిరుగుతున్నాయి.

హేమలత,
ఐదవ తరగతి, శాంతినగర్

నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేయిస్తాం..



మన ఊరు– మన బడి , అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనులు మధ్యలో ఆగిపోయాయి. త్వరలో నిధులు మంజూరవుతాయని ఉన్నతాధికారులు తెలిపారు. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడుతాం.

నరసింహులు,
ఎంఈఓ, వడ్డేపల్లి మండలం

గిడ్డంగి ప్రారంభోత్సవం ఎన్నడో ?



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గిడ్డంగి

అమరచింత: మండలంలోని ధర్మాపురం గ్రామ శివారులో రూ.10 కోట్లతో నిర్మించిన గిడ్డంగి ప్రారంభోత్సవానికి నోచుకోవడంలేదు. నిర్మాణ పనులు పూర్తయి ఐదు నెలల కాలం దాటుతున్నా ఇప్పటి వరకు వాటిని ప్రారంభించేందుకు సన్నాహకాలు చేపట్టకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమరచింత పట్టణానికి చెందిన సాయిచంద్ గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా కొనసాగుతున్న సమయంలో ఆయన తన సొంత మండలంలో రైతులకు ఉపయోగపడే విధంగా పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచే విదంగా గోదాంకు నిధులు మంజూరు చేయించారు. సూమారు రూ.10కోట్లు మంజూరు చేస్తూ.. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించడం, అంతలోనే సాయిచంద్ మృతి చెందడంతో గిడ్డంగుల పనులు నెమ్మదించాయి. గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా సాయిచంద్ సతీమణి రజనికి అప్పగించడంతో గిడ్డంగి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వీటిని వేగంగా ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు.

రైస్ మిల్లులను తరలించాలి



మాట్లాడుతున్న సతీష్‌యాదవ్

వనపర్తి విద్యావిభాగం: ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రైస్ మిల్లులను వేరే చోటకు మార్చాలని జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. 4వ వార్డులో గల లోక్‌నాథ్‌రెడ్డి మిల్లు, 22వ వార్డు ఫరీద్ మిల్లు, 28వ వార్డు సత్యనారాయణ రైస్‌మిల్, 30 వార్డులో నాగేందర్ రైస్‌మిల్లు, 31వ వార్డు ప్రతాప్‌రెడ్డి రైస్ మిల్లులు పట్టణ నడిబొడ్డిన ఉన్నాయని, వీటిని వెంటనే తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాలంటూ జిల్లా అఖిపక్ష ఐక్యవేదిక నాయకులు కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఉన్న రైస్ మిల్లుల వల్ల చాలా రోజులుగా ప్రజలు పలు విధాలుగా ఫిర్యాదు చేస్తూ, మిల్లులను తొలగించాలని ప్రజావాణి ద్వారా, ఐక్యవేదిక ద్వారా విన్నపాలు చేస్తున్నా.. అధికారులు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మిల్లులను తరలించని పక్షంలో సంబంధిత అధికారులపై వనపర్తికి వస్తున్న ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల శంకర్, గంధం భరత్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, శరత్‌చంద్ర తదితరులు ఉన్నారు.

రహదారిపైనే పంట నూర్పిళ్లు



నాగల్‌కడ్మూర్ శివారులో రహదారిపై వరిధాన్యం ఆరబోసిన రైతులు

అమరచింత: వరిధాన్యాన్ని రహదారులపై ఆరబోసి నూర్పిళ్లకు పాల్పడుతుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయే అన్న భయాందోళనలో ప్రయాణికులు తమ వాహనాలను నడపాల్సిన పరిస్థితులు దాపరిస్తున్నాయి. మండలంలోని నాగల్‌కడ్మూర్ శివారు నుంచి నాగిరెడ్డిపల్లి వరకు ప్రధాన రహదారిపై వరిధాన్యం కుప్పలుగా పోయడం, వాటిని రహదారిపై ఆరబెట్టడంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. రోడ్డు సగం వరకు ధాన్యం ఆరబోస్తుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోతు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయా గ్రామాలకు చెందిన ప్రయాణికులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై పంట నూర్పిళ్లకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన ముగ్గురు లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రాముయాదవ్, బ్రహ్మయ్య, నరేందర్‌గౌడ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన మంగదొడ్డి మౌనికకు రూ.33 వేలు, పెద్దబోయిని మహేశ్వరికి రూ.16,500, రాజేశ్వరికి రూ.21 వేల చెక్కులను అందజేసినట్లు వారు పేర్కొన్నారు. చెక్కులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, మంజూరుకు కృషి చేసిన మండల నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లింగాలస్వామి, బుచ్చన్న, మన్యం, చంద్రయ్య, సింగోటం తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై పొంచి ఉన్న ప్రమాదం

- ఊకచెట్టు వాగు వంతెనపై కూలిపోయిన రక్షణ గోడ
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



కొత్తపల్లి వద్ద వంతెనకు దెబ్బతిన్న రక్షణ గోడ

మదనాపురం: మండలంలోని కొత్తపల్లి సమీపంలో ఊకచెట్టు వాగుపై రామన్‌పాడు బ్యాక్ వాటర్ వద్ద నిర్మించిన వంతెనకు రక్షణ గోడలు దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రక్షణ గోడపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆత్మకూర్ నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి నిత్యం వందల సంఖ్యలో ప్రైవేట్ వాహనాలు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, కార్లు వెళ్తుంటాయి. రాత్రి వేళల్లో ఈ వంతెనపై ప్రయాణం చేసే వాహనాలు అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వినాయక నిమజ్జనానికి జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో విగ్రహాలను తీసుకొచ్చి ఇక్కడే నిమజ్జనం చేస్తారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జికి రెండు వైపులా రక్షణ గోడలు సత్వరమే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: జిల్లాలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎండీ జబ్బార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్‌సురభిని కలిసి 28 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం నిర్వాసితులకు 98 జీఓ ప్రకారం జిల్లాలోని బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, గణప సముద్రంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితుల సమస్యలపై కలెక్టర్‌కు వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అమరచింత పట్టణంలో 685 మంది పేదలకు 1997లో పట్టాలు ఇచ్చి ఇళ్ల స్థలాలు చూపించనందుకు, రెండేళ్ల నుంచి బాధితులు గుడిసెలు వేసుకొని నివాసముంటున్నారన్నారు. అదే విధంగా అమరచింత, ఆత్మకూర్, పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లిలో ప్రజలకు పట్టాలు ఇచ్చి స్థలాలు చూపలేదని వారు కలెక్టర్‌కు వివరించారు. వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. వనపర్తి పట్టణంలో రోడ్డు విస్తరణలో ఇల్లు, షాపులు కోల్పోయిన వారికి, మెడికల్ కళాశాలకు భూములు అప్పగించిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. సింగోటం, గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మి, జీఎస్ గోపి పాల్గొన్నారు.

ఖోఖో పోటీలో ద్వితీయ బహుమతి



మదనాపురం: మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులు ఖోఖో పోటీలో రెండో బహుమతి సాధించారు. శుక్రవారం విద్యార్థులు రాహుల్, మోహన్, వెంకటేష్, యాదగిరి, నాని ని వార్డెన్ బెనర్జీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.